# మరో ఆకలి కథ

ఆఫీస్ ఫంక్షన్ జరగడానికింత పదిరోజులుంది.

నాటకం రిహార్సెల్ నా ఊపిరి పీల్చేస్తూంది.

ఛీ! ఇంకెప్పుడూ ఈ వెధవలతో నాటకా లెయ్యకూడదు. అయినా ఇలా ఇదివర కెన్నిసార్లనుకోలేదు?

ఈరోజు రిహార్సెల్‌లో నాకు చిరాకు, కోపం, నీరసం, ఉడుకు మోత్తనం, ఏడుపు—— అన్నీ కలగాపులగంగా వచ్చాయి.

రావుగాడు మరీ వెధవ.

ఎప్పుడూ టైముకి రాడు.

ఎప్పటికీ పోర్షన్ రాదు.

ఎన్నడూ చెప్పిన మాట వినడు.

తీరా స్టేజి ఎక్కేసరికి దడా, వణుకూ.

వాడో పెద్ద నటుణ్ని అనుకుంటాడు.

ఇదంతా నా ఖర్మ.

మా ఆఫీసులో అంతకన్నా నాటకాలేసే మనుషులే లేరు. వాడిమీద ఎప్పుడేనా చిరాకుపడితే "నువ్వొక్కడివే చేసుకో!" అంటాడు.

వాడితో ఈరోజు పెద్ద యుద్ధమైపోయింది.

అసలు దీనికంతా కారణం సుమిత్ర.

దాని కసలు బుద్ధిలేదు.

పోనీ, గోలెడుతూందని దీపావళికి పుట్టింటికి పంపిస్తే పండుగై పోగానే వచ్చెయ్యద్దూ?

"మా అమ్మకి నీరసంగా ఉంటూంది. పెద్దొదిన నీళ్ళోసుకుని పుట్టింటికెళ్ళింది. చెల్లాయికి కాలేజీ చదువు. చిన్నొదిన మామూలుగానే సంవత్సరంలో సగభాగం పైగా పుట్టింటిలోనే ఉంటుంది కదా? కాబట్టి నాన్నగారి బలవంతం మూలాన మరో నెల్లాళ్ళు ఇక్కడుంటున్నాను. ప్రియమైన శ్రీవారూ! అనుమతిస్తారు కదూ?" అంటూ వ్రాసింది.

మధ్యాహ్నం ఆఫీసులో ఆ ఉత్తరం అందుకున్నప్పట్నించి నా కసలు మూడ్స్ బాగా లేవు.

సుమిత్రమీద జన్మలో ఎప్పుడూ రానంత కోపం వచ్చేసింది. (అఫ్‌కోర్స్! మా పెళ్ళయి ఇంకా సంవత్సరం కాలేదు.)

స్టుపిడ్! ఇంకెప్పుడూ ఛస్తే పుట్టింటికి పంపను.

వారం రోజులుగా తను వస్తుందని ఎదురు చూస్తున్నాను.

రోజూ పాలు ఎక్స్‌ట్రా పోయించుకుని ఉదయం ఎనిమిది గంటల దాకా వచ్చి పోయే ప్రతి ఆటోని శ్రద్ధగా పరికిస్తున్నాను.

ఒక్కటీ మా ఇంటిముందాగదు.

సుమిత్ర దిగదు.

రాత్రిళ్ళు నాకు నిద్ర పట్టదు.

అయినా, వాళ్ళ పెద్దవాళ్ళకేనా బుద్ధుండద్దూ?

మా పెళ్ళయ్యాక సగం రోజులు అక్కడే వుంది.

పోనీ, ఒకసారి పోయి వద్దామంటే ఈ నాటకం ఒకటి నా ప్రాణానికి!

ఏ జంట చక్కగా వెడుతున్నా వెంటనే సుమిత్ర గుర్తు కొచ్చేస్తూంది.

అయినా, పెళ్ళి కాకముందు ఎన్ని సంవత్సరాలు ఒక్కణ్ణీ ఉండలేదు? ఎప్పుడేనా అమ్మమీద కాని, ఇంటిమీద కాని బెంగ పడ్డానా?

మరి ఇప్పుడు?

ఏమిటీ మార్పు?

శ్రీదేవి పదిన షష్టింటి కెడితే వారం తిరక్కుండానే అన్నయ్య గుంటూరు బస్సు ఎందుకు ఎక్కేసేవాడో ఇప్పు డర్థమౌతూంది.

కార్తీకమాసం మూలంగా చలి కుదిపేస్తూంది.

దారుణమైన చిక్కని చలి.

నాకయితే మరీ ఘోరంగానూ, భయంకరంగానూ అనిపిస్తూంది.

సుమిత్ర లేనిదే ఒక్కణ్ణీ ఈ చలిని భరించలేననిపిస్తూంది.

రిహార్సల్‌నుంచి బయటికొచ్చిన భాస్కరం అడిగాడు:

"ఏమిటి, ఈ పేళ నీ మూడ్ బాగాలేదు?"

"ప్రత్యేకంగా కారణమేమీ లేదు."

"అన్నట్టు మీ మిసెస్‌నుంచి లెటరొచ్చిందా ?"

"మరో నెల్లాళ్ళు అక్కడే వుంటుందట."

"ఐ సీ: మూన్‌లాండ్‌కి పోదాం- రారాదూ? మంచి కేబరే ఉంది. ప్రీతి ఫ్రమ్ బాంబే చేస్తూంది."

సుమిత్రమీద కసి తీర్చుకోవాలనిపించింది.

"నడు" అన్నాను.

కేబరే బాగుంది.

బాగా ఎంజాయ్ చేశాం. ఇద్దరం చెరో క్వార్టరూ విస్కీ బిగించాము. అక్కడున్న కాస్సేపు హాయిగా ఫీలయ్యాను.

నన్నింటి దగ్గర తన స్కూటర్‌మీద డ్రాప్ చేస్తానన్నాడు భాస్కరం. వద్దన్నాను.

రవీంద్రభారతి దగ్గర వదిలేసి తను నారాయణగూడా వెళ్ళిపోయాడు.

బార్‌లోంచి బయటపడ్డాక చలి మరీ ఎక్కువయింది.

డాన్స్ చూసినప్పటినుంచి మనస్సులో చలి మొదలయింది.

అసెంబ్లీ కెదురుగా జాంజాం కేఫ్ దగ్గర నిలబడ్డాను. రిక్షాలు, ఆటోలు ఏమీ లేవక్కడ.

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది,

నే నక్కడ నిలబడ్డాక కొన్ని క్షణాలకు గాని చూడలేదు.

చీకట్లో కళ్ళు పెద్దవి చేసుకుని చూశాను.

ఒక యువతి గోడపక్కగా నిలబడింది.

ముదురు రంగు చీరలో కొంగు నెత్తిమీదుగా కప్పుకుని గోడకి జేర్ల బడి నించుంది.

దగ్గరగా చూస్తే ఆమె బాగా ఉందనిపించింది.

టైమ్ చూశాను. పన్నెండూ పది.

ఇప్పుడామె అక్కడెందుకు నిలబడినట్లు!

బస్సులు వచ్చే టైమ్ దాటిపోయిందే?

కొంచెం అర్థమైంది నాకు.

కొన్ని క్షణాలాగి ఆమెకు దగ్గరగా వెళ్ళాను.

"మీ రెక్కడికి వెళ్ళాలి?" నేనే అడిగాను.

"కోఠీ."

"మీ రొచ్చాక బస్సేదీ రాలేదా?"

ఆ సమయంలో బస్సు రాదని తెలిసీ అడిగాను.

"లేదు."

ఇంకొంచెం అర్థమైంది.

"మీ రెక్కడికి వెళ్ళాలి?" ఆమె అడిగింది.

"సుల్తాన్‌బజార్."

నే నింకేమీ మాట్లాడలేదు.

ఖాళీ ఆటో వెడుతూంది. నేను పిలవకుండా తనే స్లో చేశా[...] అప్పుడు పిలిచాను.

ఆటో వచ్చి నా ముందాగింది.

మళ్ళీ ఆమె దగ్గరి కెళ్ళాను.

"వస్తారా?"

"ఎక్కడికి?"

"మా ఇంటికి."

"మీ ఇంటికా?!" భయంగా అంది.

"ఫరవాలేదు. ప్రస్తుతం మా ఇంట్లో ఇంకెవరూ లేరు."

ఆమె ఏమీ మాట్లాడలేదు.

ఆమె ఇంకేమీ ఆలోచించలేదు.

ఆటోలో నా పక్కన కూర్చుంది.

నిర్జనంగా ఉన్న రోడ్డుమీద ఆటో స్పీడుగా పోతూంది. చలిగాలి రయ్యమని వీస్తూంది.

నేను వేసుకున్న స్వెట్టర్ చలి నాపలేకపోతూంది.

తాగిన మందు శరీరాన్ని వేడెక్కించలేకపోతూంది.

ఆమె భుజంమీద చెయ్యి వేశాను.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"నీ పేరేమిటి?" నేనామెను స్వంతం చేసుకున్నట్టు ఫీలవుతూ ఏకవచనంతో అడిగాను.

"సత్యవతి"

"ఇంతరాత్రి అక్కడ నిలబడ్డావేం?"

"పబ్లిక్ గార్డెన్‌నుంచి వస్తున్నాను."

అక్కడి కెందు కెళ్ళావని నే నడగలేదు.

ఆమే మళ్ళీ చెప్పింది.

"ఓ స్టూడెంటు రమ్మన్నాడు. వెళ్ళాను. అయిదు రూపాయలు చేతిలో పెట్టి ముగ్గురు వెధవలు పంచుకోబోయారు. ఇంతలో వాచ్‌మన్ వచ్చాడు. వాళ్ళు పారిపోయారు. నేను దొరికిపోయాను. లక్ష ప్రశ్నలు వేసి పోలీసుల కప్పజెపుతానని బెదిరించి అయిదూ లాక్కున్నాడు."

ఆమెను దగ్గరగా తీసుకున్నాను.

చలికి ఒదిగిపోయి కూర్చుంది.

బుగ్గమీద ముద్దెట్టుకున్నాను.

"తాగారా?" అని అడిగింది.

"ఊఁ!" అన్నాను.

"రోజూ తాగుతారా?"

"లేదు— ఎప్పుడైనా."

పెదాలు అందుకోబోయాను.

"ఇంటి కెడుతున్నాంగా— ఇంగా రెందుకు?" అంది.

ఆమెను వదిలేసి దూరంగా జరిగాను.

ఇంటి కెళ్ళాక లైటు వెలుతురులోగాని చూడలేదు— ఆమె ముఖం పీక్కు-పోయింది. కళ్ళు లోతుకిపోయాయి. జుట్టంతా చెదిరి పోయింది. చీర మాసిపోయి అక్కడక్కడ చినిగింది. భుజంమీద పిగిలి పోయిన జాకెట్టు చీర కొంగుతో కప్పుకుంది.

ఏమైనా సత్యవతి.... అందంగానే ఉంది.

పోషణలేని గొప్పింటి బిడ్డలా ఉంది.

"స్నానం చెయ్యాలి.... నీళ్లున్నాయా!" అని అడిగింది.

బాత్‌రూమ్‌లో చన్నీళ్ళున్నాయన్నాను.

ఫరవాలేదంది.

ఆమె బాత్‌రూంలో కెళ్లాక వీధి తలుపు తాళంపెట్టి దిల్‌షాద్ టాకీస్ దగ్గరకెళ్ళి కిళ్ళీలు తీసుకుని పువ్వులు, సిగరెట్లు కొనుక్కున్నాను.

తిరిగి వచ్చేసరికి సత్యవతి తల దువ్వుకుంటూంది. తెల్లచీరలో పువ్వులెట్టుకుని అభిసారికలా తయారయింది.

ఎదురుగా కుర్చీలో కూర్చుని, "మీ దే ఊరు?" అనడిగాను.

"అవన్నీ తరవాత చెబుతాను కానీ— తినడానికేమైనా ఉందా?" అని అడిగింది.

ఆ అర్ధగడంలో సిగ్గు, అభిమానం, మొహమాటం, ఆకలి కలిసి పడశలుగా బయటికొచ్చా యనిపించింది నాకు.

"నువ్వు భోజనం చెయ్యలేదా?" అనడిగాను.

"అన్నం తిని మూడు రోజులయింది." నేలకేసి చూస్తూ అంది.

"మరిందాకటినుంచీ చెప్పలేదేం?"

"అయితే ఏమీ లేదా?" నిరాశగా, ఆత్రంగా అంది.

"పొద్దున్న వండిన అన్నం ఉంది— తింటావా?" అనడిగాను.

"ఎన్నాటిదైనా ఫరవాలేదు."

ఆమె ముఖం చూస్తే చాలా బాధగా అనిపించింది నాకు.

ఆ కళ్ళలో ఆకలి సుళ్లు తిరిగింది.

వంటింట్లోకి వెళ్ళి కుకర్ తీసి చూశాను.

అన్నం చాలా ఉంది. ఈ పూటకికూడా ప్రొద్దున్నే వండుకున్నాను. కొంచెం కూర కూడా ఉంది.

అన్నం పచ్చడి, మజ్జిగ, కూర డైనింగ్ టేబుల్‌మీద పెట్టాను.

కృతజ్ఞతాపూర్వకంగా కళ్ళలోకి చూసిందామె.

ఆమె కెదురుగా కుర్చీలో కూర్చున్నాను.

తాను వడ్డించుకుంటూ అంది.

"మీరు తినరా?"

"వద్దు— బార్‌లో పరోటా, ఆమ్లెట్ తిన్నాను. ఆకలి లేదు."

"నాకుమాత్రం చాలా ఆకలిగా వుంది సుమా!" తన కోర్కెను తాను సమర్థించుకునే ప్రయత్నంలా కనుపించింది.

కంచంలో పదార్థాలన్నింటినీ ఇరవై లంఖణాల వాడు భోజనానికి కూర్చునేముందు చూసినట్లు చూసింది.

బద్దలైన అగ్నిపర్వతంలాగ, రగులుతున్న విప్లవంలాగ ఉంది ఆమె ఆకలి.

మళ్ళీ నెలదాకా భోజనం దొరకదన్నట్లు ఆమె తినడం ప్రారంభించింది.

నేను కళ్లార్పకుండా చూస్తూ కూర్చున్నాను.

మధ్య మధ్య ఆమెకూడా నాకేసి చూస్తూంది.

ఆ చూపుల్లో యుగయుగాలుగా మనుష్యులందరూ ఉమ్మడిగా అనుభవించిన దైన్యం కనిపిస్తుంది. ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి. అవి ప్రపంచంలో బాధితులు, పీడితులు అంతా కలిసి కార్చిన కన్నీటి చుక్కల్లా కనిపించాయి.

మూడురోజుల క్రితం కాదు, మూడు సంవత్సరాల నాడు ఆమె భోజనం చేసి ఉంటుందన్న అనుమానం వచ్చింది

ఆమె .... ఆశగా .... ఆబగా .... అసహ్యంగా .... అన్నం తింటూంది.

ఆకలి తీర్చుకుంటూంది.

ఆమెలో అంత ఆకలిని చూశాక నాలో ఆకలి పూర్తిగా చచ్చిపోయింది.

వెంటనే లేచి డ్రాయింగ్‌రూంలో కొచ్చేశాను.

సోఫాలో కూర్చుండిపోయాను.

ఆమె వంటిల్లంతా సర్దేసి, తలుపేసి, చేతులు కొంగుతో తుడుచుకుంటూ వచ్చి సోఫాలో నా పక్కన కూర్చుంది.

'హమ్మయ్య.... హాయిగా అన్నం తిన్నాను. రాత్రంతా ఇక మీదాన్నే' అంది దగ్గరగా జరుగుతూ.

చటుక్కున లేచి నిలబడ్డాను.

జేబులో ఉన్న పాతిక రూపాయలు ఆమె కందిస్తూ, "నువ్వీ సోఫాలో పడుకో. ఈ డబ్బు నీ దగ్గరుంచుకో. తెల్లారి నేను లేచేసరికి

ఇక్కణ్నుంచి వెళ్ళిపో. దయ ఉంచి మళ్ళీ నాక్కనబడకు" అని ఆవేశంగా అన్నాను.

ఊహించని ఈ పరిణామానికి ఆమె ఆశ్చర్యపోయింది. తెల్లబోయింది.

ఆమె మాట్లాడబోయింది.

నేనామె కా అవకాశం ఇవ్వకుండా బెడ్ రూమ్‌లోకి వెళ్ళిపోయాను.

తలుపేసుకున్నాను.

మంచంమీద పడుకున్నాను.

మనస్సు తేలికపడినట్లనిపించింది.

మానవునికి ప్రాకృతికమైన కోరిక ఒక్కటే— ఆకలి.

అది ఘోరమైనది, భయంకరమైనది, బాధాకరమైనది.

మిగతా కోర్కెలన్నీ మానసికమైనవి.

అంతకన్న ఎక్కువ ఆలోచించలేకపోయాను.

నాకు చలి తగ్గినట్టనిపించింది.

వెంటనే నిద్ర పట్టేసింది.

— "ఆంధ్రప్రభ" ఏప్రిల్ 1975